బస్ షెల్టర్లు ఏర్పాటు చేయరూ !

- ఎండలో ఎండుతూ, వానలో తడుస్తున్న ప్రయాణికులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- చర్యలు తీసుకోవాలని వినతి

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా రవాణ సంస్థ(ఆర్టీసీ) ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే నేడు ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు.

అవస్థలు వర్ణనాతీతం..

రాష్ట్రంలోనే అతి పెద్ద రవాణా సంస్థల్లో ఒకటిగా ఉన్న ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు పడే పాట్లు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. చార్జీల రూపంలో కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా ప్రయాణికులకు మాత్రం సరైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారనే విమర్శలున్నాయి.



సింగ్‌నగర్‌లో బస్సు కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నగరంలో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లపై బస్ షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు నిలువ నీడ లేక ఎండలో మాడుతూ, వర్షానికి తడుస్తూ బస్సుల కోసం గంటల తరబడి రోడ్లపైన నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

కనిపించని బస్ షెల్టర్లు..

ఆర్టీసీకి గణనీయమైన ఆదాయాన్ని తీసుకువచ్చే ప్రధాన రూట్‌లైన నున్న, వన్‌టౌన్, ఆటోనగర్, భవానీపురం, ఏలూరురోడ్డు, బందరురోడ్డు, గొల్లపూడి తదితర ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేవు. ఈ రూట్‌లలో నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఆటోనగర్, ఏలూరు రోడ్డు, కాళేశ్వరరావు మార్కెట్‌కు పనుల కోసం, వాణిజ్య అవసరాల కోసం వెళ్లి వచ్చే వారితో నిత్యం ఈ రూట్‌లు రద్దీగా ఉంటాయి.

ఈ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో నున్న, రాజీవ్‌నగర్, సింగ్‌నగర్ డాబా కోట్లు సెంటర్ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే వారు పడే పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. అరకొరగా వచ్చే బస్సుల కోసం గంటల తరబడి ఎండలో నిలబడాల్సిన పరిస్థితి. ఎండలో వేచి ఉండలేని ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే తమకు ఇబ్బందులు తప్పుతాయని, అదే విధంగా ఆర్టీసీకి ఆదాయం కూడా వస్తుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండలో నిలబడలేక పోతున్నాం..



ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలన్నా, పని మీద బయటకు వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటాం. ఆటోలకు డబ్బులు చెల్లించుకోలేక బస్సులను ఆశ్రయిస్తాం. బస్టాపుల్లో కూర్చునేందుకు బల్లలు, బస్ షెల్టర్లు లేవు. గంటల తరబడి ఎండలో నిలబడలేక పోతున్నాం.

– విజయలక్ష్మి, ప్రయాణికురాలు

అధికారులు పట్టించుకోవడం లేదు..



బస్ షెల్టర్లు ఏర్పాటు చేయమని ఆర్టీసీ అధికారులకు ఎన్నో సార్లు విన్నవించుకున్నాం. సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయమని కోరాం. ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. వృద్ధులు, మహిళలు ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

– సురేష్, ప్రయాణికుడు

క్లుప్తంగా

ప్రొటోకాల్ దర్శనాలకు ఫార్మాట్‌లో వివరాలు

ఆదేశాలు జారీ చేసిన ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సిఫార్సులు, వీఐపీలు, ప్రొటోకాల్ దర్శనాలకు ప్రత్యేక ఫార్మాట్‌లో వివరాలను దేవస్థానానికి తెలపాలని ఆలయ ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ఫార్మాట్‌ను ప్రకటించారు. భక్తులందరికీ సులభతరంగా అమ్మవారి దర్శనంతో పాటు ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజా ప్రతినిధులు, అధికార వర్గాల నుంచి ప్రొటోకాల్ దర్శనాలు వస్తున్నాయని, వాటిని క్రమబద్ధం చేసేందుకు ఈ ఫార్మాట్‌ను రూపొందించామన్నారు. దర్శనం కోరుకునే వారి పేరు, ఫోన్ నంబర్, సభ్యుల సంఖ్య, వాహనం నంబర్‌తో పాటు సిఫార్సు చేసిన వారి వివరాలను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఆదేశాలు శనివారం నుంచి అమలులో పెట్టాలని ఆలయ అధికారులు, సిబ్బందిని ఈవో ఆదేశించారు.

సిమెంట్ దిమ్మెలు సరిచేశారు..



సాక్షి ఎఫెక్ట్..

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. మధురానగర్ వంతెన సమీపంలోని మురుగు కాలువపై సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. గతంలో సదరు సిమెంట్ దిమ్మెలను సక్రమంగా ఏర్పాటు చేయలేదు. ఈ విషయాలను వివరిస్తూ తూతూమంత్రంగా సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు సిమెంట్ దిమ్మెలను సరిచేయించారు. అలాగే మలుపు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు సెట్ కాకపోవటంతో వాటిని తొలగించి శ్లాబ్ వేయాలని నిర్ణయించారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియచేశారు.

టిఫిన్ బండి వితరణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మొగల్రాజపురంలో నివాసం ఉంటున్న కొలసాని రాజేష్ దంపతులకు జీవనోపాధి నిమిత్తం రూ.20 వేలు విలువ చేసే టిఫిన్ బండిని వైఎన్నార్ చారిటీస్ తరఫున సంస్థ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ జీవనోపాధి కష్టంగా ఉందని తమకు సహాయం చేయాల్సిందిగా రాజేష్ దంపతులు కోరడంతో టిఫిన్ బండిని అందజేశామన్నారు. తోటి వారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దాంట్లోనే సహాయం చేయాలన్నారు.

డాక్టర్ మెహబూబ్ షేక్‌కు అరుదైన అవకాశం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడకు చెందిన ప్రభుత్వ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్ డాక్టర్ మెహబూబ్ షేక్‌కు అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 22 నుంచి 25 వరకూ సింగపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ 26వ వార్షిక సదస్సులో డాక్టర్ మెహబూబ్ షేక్‌కు ప్రసంగించే అవకాశం దక్కింది. ఈ సదస్సులో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి రెండు వేల మందికి పైగా వైద్యులు పాల్గొంటుండగా, తొలిరోజు డాక్టర్ మెహబూబ్ షేక్ ఫేషియల్ కాస్మొటిక్ సర్జరీలపై ప్రజెంటేషన్ చేయనున్నారు. ఈ సదస్సులో ప్రసంగించేందుకు దక్షిణ భారతదేశం నుంచి నలుగురికి మాత్రమే అవకాశం లభించగా, వారిలో డాక్టర్ మెహబూబ్ షేక్ ఉన్నారు. ఈ సదస్సులో ఫేషియల్ కాస్మొటిక్ సర్జరీలతో పాటు, అంకాలజీ, హెడ్ అండ్ నెక్ క్యాన్సర్, ట్రామా రీ కన్‌స్ట్రక్షన్ వంటి అంశాలపై నిపుణులు విశ్లేషణాత్మక ప్రసంగాలు చేయనున్నట్లు డాక్టర్ మెహబూబ్ షేక్ తెలిపారు. లండన్ రాయల్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌లో ఉన్నత విద్యను అభ్యసించి గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ మెహబూబ్ షేక్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్‌గా, ప్రొఫెసర్‌గా రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓపీ పెరగాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆస్పత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని, ఓపీ ఇంకా పెరగాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కో ఆర్డినేటర్ వి.మహేష్ అన్నారు. రామలింగేశ్వరనగర్‌లోని పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ఇక్కడకు వస్తున్న రోగుల గురించి ఆయన సిబ్బందితో పాటు డాక్టర్ సౌజన్యను అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందుతున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులకు అవసరమైన రక్త పరీక్షలన్నింటిని ఒకే రోజులో చేస్తున్నట్టు చెప్పారు. థైరాయిడ్, లివర్, షుగర్, కొలెస్ట్రాల్, యూరిన్, బ్లడ్ పిక్చర్ తో పాటు మొత్తం 60 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సౌజన్య, సిబ్బంది ఉన్నారు.

వీఎంసీ సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యం

- కమిషనర్ ధ్యాన చంద్ర
- వీఎంసీలో ఆరోగ్య శిబిరం నిర్వహణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. జాతీయ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వీఎంసీ సిబ్బందికి ఉచితంగా బీపీ (రక్తపోటు), షుగర్ (రక్తంలో గ్లూకోజ్) పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యం సంస్థ పనితీరును ప్రతిబింబిస్తుందని, సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే వారు విధులను సమర్థంగా నిర్వహించగలరన్నారు. శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షల ఫలితాలను సిబ్బందితో చర్చించి, అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయా విభాగాధికారులకు ఆదేశించారు. సిబ్బంది ఆరోగ్యానికి సంబంధించి విభాగాల వారీగా ఆరోగ్య సమాచారం నమోదు చేసి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యాలయ వాతావరణం సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా, సిబ్బంది ఆరోగ్యానికి సహకరించే విధంగా మెరుగైన చిట్కాలు, సూచనలు ఇవ్వాలని కమిషనర్ చెప్పారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఈ తరహా ఆరోగ్య శిబిరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు.



వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు బీపీ చెక్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని హెల్పింగ్ టు గెదర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ట్రస్ట్, దాతల సహకారంతో నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి మాట్లాడుతూ.. నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే షఫీవుల్లా, హేమంతరావు, రమ్య, బి.వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ సూచించారు. ఈ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. డివిజన్‌లో బీవీ సుబ్బారెడ్డి స్కూల్ వద్ద కార్పొరేటర్ సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కనాటారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రజలు ఎండల తీవ్రత, వేసవి వడగాల్పుల నుంచి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునే విధంగా అవగాహన కల్పించి మొక్కలను నాటామన్నారు. స్పెషల్ అధికారి ఈఈ ప్రభాకరరావు, యర్రగొర్ల శ్రీరాములు, కాకొల్లు రవికుమార్, బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రకు ప్రజలు దూరం

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రజలు దూరంగా ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను భాగస్వాములను చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో శనివారం ప్రజలు ఎండ తీవ్రత, వేసవి వడగాల్పులు నుంచి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొనే విధంగా అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. అయితే మొక్కలు నాటే కార్యక్రమం గ్రామాల్లో మొక్కుబడిగా జరిగింది. ప్రజలకు, సోషల్ వర్కర్లకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల్లో ఒక్కో మొక్కను మాత్రమే నాటారు.

భక్తితత్వాన్ని పెంపొందించిన అన్నమయ్య సంకీర్తనలు



ముత్యాలంపాడులో అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు



లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపట్టాభి రామచంద్రస్వామివారి దేవాలయంలో శనివారం కొప్పరపు ఉమాబలరాం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం వ్యవస్థాపకుడు శాస్త్రీయ సంగీత విద్వాంసులు, బ్రహ్మశ్రీ పప్పు సదాశివశాస్త్రి ఆధ్వర్యాన శ్రీ పట్టాభిరామ చంద్రస్వామి దేవాలయంలో అన్నమయ్య సంకీర్తనల గానం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పరపు ఉమాబలరాం ఆలపించిన భావయామి గోపాల బాలం, చేరి యశోదకు, నారాయణ నీ నామమే గతి యిక, జగన్మోహనాకారా తదితర 15 జనరంజకమైన అన్నమ్మయ్య కీర్తనలు మృదుమధురంగా ఆలపించారు. అలాగే పప్పు సదాశివశాస్త్రి ఆలపించిన అన్నమయ్య కీర్తనలను భక్తులను భక్తిపారవశ్యంలో తేలియాడించాయి. అన్నమయ్య కీర్తనలను ఆద్యంతం శ్రావ్యంగా ఆలపించారు. మృదంగం కేబీ కిశోర్, వయోలిన్ చావలి శ్రీనివాస్, కీ బోర్డు దావులూరి వీరభద్రరావు వాయిద్య సహకారం అందించారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనం

విజయవాడకల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర, వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జరిగిన కార్యక్రమంలో చిన్నారులు సహితం అన్నమయ్య పద యజ్ఞంలో పాల్గొన్నారు. పరాశరం వరేణ్య, దుగ్గిరాలహస శ్రీమేధ, గానుగపాటి కావ్య, ఆచాంట సాయి మిత్ర మంజీర, బి.కామేశ్వరి, ఎన్‌సీ సాయి శాంతిశ్రీ, మల్లాది సూరిబాబు, కస్తూరి గోపాలరావు, మోదుమూడి సుధాకర్ అన్నమయ్య రంచించిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. ట్రస్టీబోర్డ్ చైర్మన్ మాగంటి వేణుగోపాల్, కార్యనిర్వాహకుడు సీహెచ్ రామ్మోనరావు, మేనేజర్ శర్మ నిర్వహించారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

గన్నవరం: విద్యాశాఖ తీసుకుంటున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయం ముట్టడి చేపట్టినట్లు ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విక్టర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ సంఘాల లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా జీఓలను విడుదల చేయడం దుర్మార్గమన్నారు. తొమ్మిది రకాల పాఠశాలలను ప్రతిపాదించడం కూడా విద్యా వ్యవస్థ పురోభివృద్ధికి మంచిది కాదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు. ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, బదిలీల్లో పోస్టులు బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలు చూపాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇరువురు టీచర్లను ఉండేలా చూడాలన్నారు. మరో ఎనిమిది ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు మోత్రు ఆనంద్‌కుమార్, చిమట కృష్ణారావు, రామెళ్ల ఆనంద్‌కుమార్, శ్రీధర్, సురేష్, అబ్దుల్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో విద్యాసాగర్, సంఘ నేతలు

పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ ప్రోత్సాహంతో పితృదేవోభవ క్లబ్ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు శనివారం ఎనికేపాడు పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం పక్కన మండల పరిషత్ పాఠశాల వద్ద సబ్జా సుగంధి వాటర్‌ను బాటసారులు, ప్రయాణికులకు పంపిణీ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ వుడత్తు సరేంద్ర, తమ్మన సుబ్బారావు, పైడిమర్రి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలను తొలగించాలని ధర్నా



ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ శనివారం కార్మిక వాడలోని సాయిహోటల్ సెంటరులో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ జవహర్ ఆటోనగర్ ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ అన్నారు. సుమారు 60 వేల మందికి పైగా కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారని, అలాంటి కార్మికవాడలో చెత్తాచెదారాన్ని తీయకుండా, గత కొన్ని రోజులుగా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. కార్మికవాడలో ఏ వీధిలో చూసినా టన్నుల కొద్దీ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. ఏడాదిన్నర క్రితం అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆటోనగర్‌లో తాగునీటి ట్యాంకును నిర్మించినప్పటికీ అధికారులు ఇప్పటివరకు కార్మికులకు నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం తూర్పునగర కార్యదర్శి పి.కృష్ణ, నగర కార్యవర్గసభ్యులు టి.చంద్రశేఖర్, కె.రమణ, ఎన్.నాగేశ్వరరావు, వీబీ రాజు, వరప్రసాద్, గురుమూర్తి, రవీంద్ర పాల్గొన్నారు.

చెట్లను పెంచుదాం.. ఎండ వేడిమిని అధిగమిద్దాం

జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చి చెట్లను పెంచడం ద్వారా ఎండ వేడిమిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని భూ పరిపాలన చీఫ్ కమిషనర్(సీసీఎల్ఏ) ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో 'బీట్ ద హీట్' నినాదంతో సత్యనారాయణపురం సర్కిల్–2 కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛత కార్యక్రమాల విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి వాటిని విజయవంతం చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. సాధారణంగా పట్టణాలలో ఎక్కువ శాతం భూమి కాంక్రీట్‌తో కప్పబడి ఉంటున్నందున మొక్కలు పెరిగే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని, దీంతో పట్టణ ప్రాంతంలోని ప్రజలు అధిక వేడిమి బారిన పడతారన్నారు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేట్ స్థలాల్లో మొక్కలను నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను వినియోగించే సాంప్రదాయాన్ని విడనాడలన్నారు. జిల్లాలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్స్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసి పర్యావరణాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రత్యేక అధికారి జయలక్ష్మి, ఎమ్మెల్యే బొండా ఉమా, కమిషనర్ ధ్యానచంద్ర

వేసవిలో ప్రత్యేక చర్యలు..

నగరపాలకసంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర మాట్లాడుతూ.. జనవరి నుంచి ప్రతి నెలా మూడో శనివారం ఒక ఇతివృత్తంతో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని 64 వార్డులలో 186 సచివాలయ పరిధిలో రూ.12 కోట్లతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు 84 చలివేంద్రాలను ఏర్పాటు చేశామని, పశువులకు 120 ప్రాంతాల్లో, పక్షులకు 50 ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ, ఆర్డీవో కె.చైతన్య, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ, నాయక్, జాయింట్ డైరెక్టర్(అమృత్), జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, కార్పొరేటర్ శర్వాణిమూర్తి, అధికారులు, ఏఎంహెచ్ఓ బాబు శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంధన కొలతలపై అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పెట్రోల్, డీజిల్ కొలతలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ పెట్రోలు బంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. కొలతల వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ సదస్సులో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ టి.రాజేంద్రప్రసాద్ పాల్గొని పలు సూచనలు చేశారు. వస్తువులు కొనే సమయంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలని, కొలతలు, ప్యాకేజీలు పరిశీలించాలన్నారు.

గ్యాస్, బంగారం వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ ఎ.ఎస్.ఆర్. శేఖర్ తెలియజేశారు. మే 20న ప్రపంచ కొలతల (మెట్రాలజీ) దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఓసీ రిటైల్ సేల్స్ మేనేజర్ సంతోష్ విజయ్, లారీ ఓనర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కోనేరు జగదీశ్వరరావు, పి.వి.ఎస్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేంద్రప్రసాద్

నగరంలో ఐశ్వర్య రాజేష్ సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సంక్రాంతికి వస్తున్నాం... ఫేమ్ ఐశ్వర్య రాజేష్ శనివారం నగరంలో సందడి చేసింది. మహాత్మాగాంధీ రోడ్డులోని పీవీఆర్ మాల్‌లో ఏర్పాటు చేసిన వజ్రాభరణాల స్టాల్ లాడియాను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఐశ్వర్య రాజేష్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ అంటే తనకెంతో ఇష్టమన్నారు. ఇక్కడకు వచ్చిన అభిమానులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో రెండు సినిమాల్లో నటించనున్నట్లు తెలిపారు. తమిళంలో కూడా ఆఫర్లు వస్తున్నాయని, తనను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న ఐశ్వర్య రాజేష్

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా విజయోత్సవ ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారత సాయుధ దళాలు ఉగ్రదాడులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి మద్దతుగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. డీఆర్ఎం నాయకత్వంలో పెద్ద సంఖ్యలో రైల్వే అధికారులు, సిబ్బంది, ఆర్పీఎఫ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు, పలు పాఠశాలల విద్యార్థులు ప్లకార్డులు, జాతీయ జెండాలను చేపట్టుకుని 'భారత్ మాతాకి జై', 'జై జవాన్.. జై కిసాన్' నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం, క్లాక్ టవర్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహం నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ జాక్ అండ్ జిల్ స్కూల్ మీదుగా రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంలోని బాపూజీ వెయిటింగ్ హాల్ వరకు సాగింది. దీంతో రైల్వే స్టేషన్ ప్రాంగణం జాతీయ నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ మన దేశ సాయుధ దళాల పోరాట పటిమను ప్రశంసించారు. ప్రతికూల పరిస్థితుల్లో దేశ పౌరులందరూ దేశభక్తి, ఐక్యతతో నిలబడటం దేశం సమష్టి బలాన్ని నిరూపించిందని అన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు పీఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

శ్రీవేణుగోపాలస్వామికి అష్టబంధన ప్రయోగం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాల్లో భాగంగా శనివారం శ్రీవేణుగోపాలస్వామివారికి అష్టబంధన ప్రయోగం జరిగింది. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాలను పునరుద్ధరించగా పుణ్యాహవచనం, కుంభారాధన, అష్టబంధన ద్రవ్య ఆరాధన క్రతువుల అనంతరం టీటీడీ ధర్మగిరి వేద పాఠశాల ఆచార్యులు, వైఖానస ఆగమరత్న స్ఫురత్ రత్న శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస దీక్షతులు, వేద పండితులు సుదర్శనం సీతారామచార్యులు సమక్షంలో వేణుగోపాలస్వామికి అష్టబంధన ప్రయోగం జరిగింది. తొలుత దేవస్థానం ప్రధానార్చకులు రొంపిచర్ల అప్పలాచార్యులు(గోపాలం), రొంపిచర్ల శేషాచార్యులు, అర్చకస్వామి రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలో రుత్విక్కుల బృందం విశేష పూజలు నిర్వహించారు. శ్రీనివాస దీక్షితులు అష్టబంధనం, అందుకు సంబంధించిన నియమ నిబంధనలను భక్తులకు ఉపదేశించారు.